కథానిక

# పోస్టుకాని ఉత్తరాలు!

కె. రామలక్ష్మి

ఉత్తరం పోస్టుచేసి వస్తాను...అంటూ హఠాత్తుగా లేచాడు కృష్ణమూర్తి. ఎంతో తెరిపిగా కూర్చుని సిగరెట్టు కాలుస్తున్న కృష్ణమూర్తిని అప్పటిదాకా చూస్తున్న పార్వతికి—ఎవరికా యీ ఉత్తరం అన్న సందేహం కల్గింది. ప్రశ్న లేకుండానే ప్రశ్నార్థకంగా చూసింది. కృష్ణమూర్తి పార్వతి ముఖంలో నిలిచిన ప్రశ్నకి సమాధానంగా చిరునవ్వునవ్వేడు. ఆ నవ్వుతో పార్వతి సందేహం అనుమానంగా మారినా ఏమీ అనలేక, మూతి తిప్పుకొని వంటయింటిలోకి ప్రవేశించింది.

పార్వతికి యిట్టేకోపం వచ్చేస్తుంది. పార్వతి కన్నా అర్థగంటముందుగా కోపమూ విసుగూ పుట్టేయని వేళాకోళం చేస్తూంటే, కృష్ణమూర్తి మీద యింకా కోపంవచ్చేది పార్వతికి. పార్వతికి కోపం రావడం పోవడం కూడా అలవాటయిన కృష్ణమూర్తికి పార్వతికి కోపంవస్తుందంటే భయం పోయింది. ఈ నిజం తెలిసే పార్వతి ఉడుకుమోతుతనం. తనకోపం తనబలహీనత అని తెలిసీ చిన్న చిన్న విషయాలకి సహితం కోపం తెచ్చుకోకుండా ఉండలేదు. అలా అని చిన్న చిన్న విషయాలని అతి ఉదాత్త విషయాలుగా మార్చేసి పార్వతిని ఏడిపించడమూ మానడు కృష్ణమూర్తి.

సరిగ్గా యిదే జరిగింది యీ రోజు—కృష్ణమూర్తి లేచి ఉత్తరం పోస్టుచేసి వస్తాననే సరికి. కృష్ణమూర్తి ఉత్తరాలు రాసీ పోస్టుచేయని అనేక సందర్భాలు జ్ఞాపకం వచ్చాయి పార్వతికి. ఈ కృష్ణమూర్తికి నేనంటే ఎంతనిర్లక్ష్యం! అని మళ్ళీ ఒకసారి (యిదివరలో ఎన్నిసార్లు అనుకుందో లెఖ్ఖలేదు) అనుకుంది. అలా అనుకుని ఊరుకోలేదు—"ఎవరికి కృష్ణమూర్తీ, ఆ ఉత్తరం" అంటూ వంటయింటిలోనుంచి వచ్చింది—కుతూహలం చంపుకోలేక. కృష్ణమూర్తి చిన్న నవ్వు నవ్వేడు—ఆ ఉత్తరం సంగతి నీకెందుకులే అన్నట్లు. "చూడు పార్వతీ, యింకోళ్ళ ఉత్తరాల విషయంలో ఎందుకంత క్యూరియాసిటీ!" అలా కుతూహలం చూపడం తప్పు—అన్న ధోరణిలో అన్నాడు.

"నీ ఉత్తరం ఎవరికీ అంటే—ఏదీ నాకు చూపించు అని కాదబ్బాయి—అర్థం. ఉట్టినే కాజువల్ గా అడిగాను కాని"

"అదుగో అప్పుడే అంత ఉడుక్కోవడం దేనికి? నేను మటుకూ ఏమన్నానూ? నా ఉత్తరం విషయంలో నీకెందుకూ అంత క్యూరియాసిటీ అని అన్నాను కాని"

"సరేలే అబ్బాయి, అర్థంలేకుండా వాదించే నీలాటి వాళ్ళతో మాట్లాడ్డం, నాదే బుద్ధితక్కువ. సరేలే, పోయి పోస్టుచేసిరా లేకుంటే రాత్రంతా కలవరిస్తావు." అంటూ మళ్ళీ ముఖం చిట్లించుకొని వంటయిల్లు ప్రవేశించింది. ఆమె అటు తిరగనిచ్చి కృష్ణమూర్తి నవ్వుకుంటూ కుర్చీలో చేరబడి సిగరెట్టు ముట్టించాడు. ఏమిటో యీ పార్వతితత్వం! ఏమిటో యీ ఆడవాళ్ళ తత్వం! అనుకున్నాడు. అలా ఏ క్షణాన అనుకున్నాడో కాని, పార్వతిని తెలిసిననాటినుండీ కూడా, ఆమె చూపిన వింత ధోరణే జ్ఞాపకానికి వచ్చింది.

పార్వతిని తొలిసారి చూసిన రోజు ఎన్నటికీ మరిచిపోలేదు కృష్ణమూర్తి. తెల్లటి చీర కట్టుకుంది. దానికి తగినట్లు, ఒంటికి తగ్గట్లు ఎర్రటి రవిక తొడిగింది. చీరకొంగు నడుముకి బిగించి దోపింది. జుట్టంతా మెడలమీద పడకుండా కొప్పుపెట్టింది. ముఖంనిండా కాటుక! ఏదో అర్జంటుగా పాఠ్లోసించునే చదివేస్తూంది. గుమ్మంలో పదినిముషాలాయి నుంచున్నా కృష్ణమూర్తిని చూడనేనా

లేదు. అప్పుడే అనుకున్నాడు కృష్ణమూర్తి—ఏదో ప్రేమలేఖ కాబోలు చదువుతోందని. ఆ ప్రేమ లేఖ వ్రాసిన ప్రముఖుడు యీ అవతారంలో పార్వతినిచూస్తే—మళ్ళీ ఉత్తరం రాస్తాడా అనుకున్నాడు. కృష్ణమూర్తికి నవ్వొచ్చింది — తన లాంటి వాడైతే తప్పకుండా రాస్తాడనిపించి. అవును—యిలాంటి వైల్డు బ్యూటీని తప్పించుకోడం ఎలాగా అనికూడా అనుకున్నాడు.

“రాధాయి ఉన్నాడా? అని కేకవేశాడు కృష్ణమూర్తి. ఉలిక్కిపడి చూసింది పార్వతి. చూడ్డమే తరవాయి, గబగబా, కొప్పు విప్పేసి జుట్టు సరిచేసింది. నడుముని బిగించివున్న చీరకొంగు తీసి సరిచేసుకొంది. అప్రయత్నంగా తన కళ్ళ కాటుక జ్ఞాపకం వచ్చిందో ఏమో, చీరకొంగుతో కళ్లు తుడుచుకుందామని ప్రయత్నం చేసింది... అంతేకాని సమాధానంమటుకు చెప్పలేదు. ఇదంతా ఎన్ని క్షణాలు పట్టిందోకాని, కృష్ణమూర్తికో యుగంలా తోచింది. ఈవిడకి చెవుడా? అనుకున్నాడు.

“మిమ్మల్నేనండీ, రాధాయి వున్నాడా?” యీమాటు కొంచం మోటుగానే అడిగాడు.

“నన్నే పిలిచినట్లు తెలిసిందికాని, రాధాయి ఎవరా యీ యింట్లో అని ఆలోచిస్తున్నాను.” అంది కృష్ణమూర్తిని పరిశీలనగా చూస్తూ.

“ఓ, రాధాయి అంటే మీకెలా తెలుస్తుంది! నయం యింకా రాధిగాడన్నాను కాదు! నేనడిగింది రాధాకృష్ణ ఉన్నాడాఅని!” అన్నాడు చిన్ననవ్వు నవ్వుతూ కృష్ణమూర్తి. “ఓ కిట్టిగాడు టండీ మీకు కావలసింది! అయినా యింకా కిట్టి సంగతి తెలియదల్లేవుంది మీకు, యింకా పదేనా కాలేదు. అప్పుడే ఎక్కడ లేస్తాడు? అయినా మీరెవరో చెప్తే లేపిచూస్తాను.” అంటూ ఎదురు చూసింది పార్వతి. ఆపాద మస్తకం పార్వతిని కన్నారా చూస్తూన్న కృష్ణమూర్తికి పార్వతి అడిగిన ప్రశ్న వినపడలేదు. ఆ కళ్ళకాటుకా అవీ సరిదిద్దేస్తే పార్వతి ఎలా వుంటుందా అని ఆలోచిస్తున్నాడు.

పార్వతి ముఖకవళికలప్పుడే మారిపోయాయి. ఏమిటీ మొగవాళ్లు! ఆడది కనిపిస్తేచాలు కళ్ళప్పగించేస్తారు, సిగ్గులేక పోతేసరి. అనుకుంది. అనుకోడంతో వూరుకోలేదు. “ఎందుకలా చూస్తావు? నీపేరు చెప్తే, అన్నయ్యకి చెప్తాను...” అంది కోపంగా. కృష్ణమూర్తి మనస్సు నొచ్చుకుంది. ఏమిటీ ఆడపిల్లలు—ఎంతట్లో అపార్థం చేసుకుంటారో! పార్వతిని చూస్తూ అలా వుండిపోయినందుకు చిన్నపుచ్చుకున్నాడు. క్షమించమని అడుగుదాం అనుకున్నాడు. కాని “ఏం చూడ్డం లేదండీ, మీ కాటుక...” అన్నాడు. “ఆడపిల్ల కనిపిస్తేచాలు, యీ కాలంవాళ్ళు యింతే.” అని మళ్ళీ వెనక్కి చూడకుండా లోపలికి వెళ్ళిపోయింది పార్వతి.

పార్వతి దురుసుతనానికి కృష్ణమూర్తి చాలా బాధపడ్డాడు; రాధాయికోసం తనెన్నిసార్లు రాలేదు? అయినా ముక్కూ ముఖం ఎరగని మనిషిలా ప్రవర్తించింది. చివరికి అవమానించి మరీ లోపలికి వెళ్ళిపోయింది...అలా అవమానించిన మనిషిమీద అసహ్యం వెయ్యడానికి బదులు తనకి అభిమానం ప్రారంభం కావడంతో కృష్ణమూర్తికి—తనమీద తనకే కోపం వచ్చింది. అయినా ఏంచేస్తాడు? తన మనస్సే తనకి ఎదురు తిరుగుతే! అందుకే, మారు మాటలేకుండా రాధాయి నిద్రలేచి వచ్చేదాకా హాల్లో కూర్చున్నాడు. రాధాయి పదిన్నరవుతూంటే వచ్చాడు. “ఏరోయ్ యిలా కూర్చుండి పోకపోతే నన్ను లేపమనక పోయావురా? అయినా యింత మొహమాటం అయితే ఎలా?”ఏదేదోఅనుకుంటూపోతున్న రాధాయికి కృష్ణమూర్తి అడ్డురాలేదు. అయినా రాధాయి రక్కున ఆగేడు. “ఏరా కృష్ణా అలా వున్నావు? ఒంట్లో బాగాలేదా? ఎన్నాళ్ళు సెలవు పెట్టొచ్చావు? ఎప్పుడొచ్చావు?” అన్నాడు.

“అమ్మయ్య! యిప్పటికేనా మొదట వేయవలసిన ప్రశ్నలు వేశావురా! అవును కానీ, మీ చెల్లాయికి దృష్టిదోషమా! తలపొగరా! మాటేనా వినిపించుకోకుండా వెళ్ళింది లోపలికి. మళ్ళీ కనిపిస్తేనా ఏదైనా చెప్పడానికి. అందుకే యిలా కూర్చున్నాను. ఓ పదిహేను రోజులుందామని వచ్చాను. అమ్మకికూడా ఒంట్లో బాగులేదు.” సవిస్తరంగా, చెప్ప దలుచుకొన్నదంతా చెప్పే

శాడు కృష్ణమూర్తికి. హఠాత్తుగా ఒక సంగతి జ్ఞాపకం వచ్చింది: "ఔనుగాని రాధాయి, ఒంట్లో బాగుండలేదా అని ఎందుకడిగావురా?" ఉత్సాహంతో అడిగాడు కృష్ణమూర్తి, "నీ వెధవముఖం చూసి!...ఉట్టినే పాలిపోయి, లంఖణాలు చేసిన వాడి ముఖంలా వుంటేను!" నవ్వుతూ సమాధానం యిచ్చాడు రాధాయి.

"అదంతా మీచెల్లెలి స్వాగతానికి రియాక్షన్" అనేశాడు కృష్ణమూర్తి.

"అదో గడుగ్గాయిరా, అమ్మ దీన్ని నాకంటకట్టి హాయిగా చచ్చిపోయింది..."

"ఈ మహాతల్లినీ ఎవరికేనా అంటకట్టెయ్యకూడదూ?" కుతూహలంగా జవాబుకోసం ఎదురు చూశాడు కృష్ణమూర్తి.

"నీలాంటి వాడెవడో తెగించి దాన్ని పెళ్ళాడాలి కాని, మామూలు వాళ్ళెవరూ దాన్నిచూసి చూసి చేసుకోరు" నెమ్మదిగా అన్నాడు రాధాయి.

"నీకేం అభ్యంతరం లేకుండావుంటే నాకేం బాధలేదురా రాధాయి, ఎట్టొచ్చీ అమ్మాయిని ఒప్పించు." నెమ్మదిగానే కృష్ణమూర్తీ మాటిచ్చాడు.

రాధాయి ఆనందం ఆరోజు అవధులు దాటింది. తల్లేబతికి వుంటేనా అనుకున్నాడు. అయినా పోయిందేముంది! కృష్ణమూర్తికన్నా మంచి వరుణ్ణి తనెక్కడ తేకలుగుతాడు? చిన్న చిన్న లోపాలు ఉన్నా కృష్ణమూర్తి తత్వం బాగా తెలుసు రాధాయి. ఒక భారం మీదుంటే కృష్ణమూర్తి ఒక దారిన పడతాడనే నమ్మకం వుంది. అందుకే పార్వతిని అతనికివ్వడానికి నిశ్చయించుకున్నాడు.

వివాహమయి ఆర్నెల్లుగడిచిన ఈనాడు కుర్చీలో కూర్చుని సిగరెట్టు కాలుస్తూన్న కృష్ణమూర్తికి పాతసంగతులన్నీ జ్ఞాపకంవచ్చి ఎంతో ఆనందాన్నిచ్చాయి. ఆనాటి పార్వతి విగ్రహం అతని హృదయంలో శాశ్వతంగా నిలచిపోయింది. ఆనాడు రాధాయికి ధైర్యంగా మాట ఇవ్వకపోతే ఒక పెన్నిధిని పోగొట్టుకొనేవాణ్ణి అనుకొన్నాడు కృష్ణమూర్తి ... ఇప్పటికీ పార్వతిలో ఏంమార్పు రాలేదు. కాని కృష్ణమూర్తికి మటుకు ఒక అనుమానం...ఆ తొలిరోజు ఆమె చదువుతూవున్న ఉత్తరం రాసినవ్యక్తి ఎవరా అని.ఆ వూహ ఒక మధురవ్యథగా పరిణమించింది అతనికి. కాని ఒక రోజు. పెళ్ళయిన కొత్తలో ఏ మూడ్‌లోనుందో ఏమో, అడగ్గానే చెప్పేసింది పార్వతి-ఆ ఉత్తరం ఏ వ్యక్తినుండీవచ్చినది కాదనీ, అది తను రాసినదేననీ, అయినా తనూ ఎవరికీ ప్రత్యేకించి రాసినది కాదని. కృష్ణమూర్తి నవ్వుతూ అన్నాడు—పోనీ ఆ ఉత్తరం నాకు పోస్టు చెయ్యకపోయావా! అని.

"నీకలాంటి ఉత్తరం వ్రాస్తే నన్ను గురించి ఏమనుకొనేవాడివో. అందుకే, చింపేసాను" అంది పార్వతి. కాని అది అబద్ధం అని తెలుసు కృష్ణమూర్తికి...

అందుకే, ఉత్తరాలు పోస్టుచెయ్యడం సంగతి వచ్చినప్పుడల్లా, కృష్ణమూర్తికి పార్వతి...ఆరోజు పార్వతి జ్ఞాపకం వస్తుంది. పార్వతికి చచ్చేటంత సిగ్గేస్తుంది. అందుకే ఉత్తరం విషయంవస్తే వాళ్ళలో చిన్న ప్రణయ కలహం చెలరేగుతుంది. యీ ఊహాలలో మునిగిపోయి కృష్ణమూర్తి అలా చిరునవ్వు ముఖంతోనే పడుకున్నాడు వాలు కుర్చీలో. అతని హృదయం ప్రశాంతంతో పార్వతి పట్ల ప్రేమతోనిండి హాయిగా నిద్రిస్తోంది.

అతని ప్రశాంత వదనం కళ్ళపడింది పార్వతికి వంట యింట్లోనించి యివతలకి రాగానే. ఏమీ జరగనట్టే యీ కృష్ణమూర్తి ఎంత హాయిగా వుండకలడు! అనుకుంది. ఇంతసేపు వంటయింట్లో కూర్చుందన్న మాటేగాని ఒక్క పని కూడా సవ్యంగా పూర్తికాలేదు. ఎందుకో తెలియని తత్తరపాటుతో ఆమె హృదయం అల్లకల్లోలం అయింది. ఆ అల్లకల్లోలం మధ్యనే మెరుపుల్లాంటి మధురస్మృతులు జ్ఞప్తికివచ్చి ఎదురుగా ఎవరూ లేకపోయినా సిగ్గుతో ఆమె తల వ్రాలింది. పెళ్ళయి కొత్తగా కాపరానికి వచ్చిన రోజులలో కృష్ణమూర్తి పెట్టెతీసి అయిదారుత్తరాలుఇచ్చాడు పార్వతికి. స్టాంపులూ అవీసరిగా అంటించినవే; అయినా ఉత్తరాలు పోస్టులోపడలేదు! అవి తను పుట్టినింట ఉన్నప్పుడు అందివుంటే! ఎంత ఆనందించేది? అన్నవూహాలు కలిగాయి పార్వతికి. అప్పుడే కృష్ణమూర్తితో దెబ్బలాడింది కూడా. నీకు

నేనంటే నిర్లక్ష్యం అందుకే నాకు ఉత్తరాలు రాసి పోస్టుచెయ్యలేదు అని. నీకూ నాకూ మధ్య ఉత్తరాలెందుకు పార్వతీ, మనిద్దరం ఒకటేగా! అవి సద్దపోతే "ఉత్తరాలు ఉత్తరాలే. అనిరాసిన వాళ్ళకీ అందుకున్న వాళ్ళకీ ఎంత ఆనందాన్ని స్తాయో, నీ కెలా తెలుసు?" అనేసి నాలుకొర్కు కుంది పార్వతి. అతని కెందుకు తెలియదూ? అన్న సంగతి అప్పటిదాకా తట్టలేదు. ఎప్పుడూ తనే బద్ధకించి కృష్ణమూర్తికి ఉత్తరాలకి జవాబు రాసేది కాదు. అది తలుచుకొని సిగ్గేసింది పార్వతికి. కృష్ణమూర్తి ఎంత ఉదారుడు! తనలోని ఎన్ని లోపాలనో, సుగుణాలుగా, ఆనందాన్నిచ్చే చిహ్నాలుగా చేసుకొన్నాడు. ఇంతసేపు వంట యింట్లో; పాతడోహాల బరువుతో బరువెక్కిన కనురెప్పలతో పార్వతి బయటికి వచ్చింది. వాలు కుర్చీలో, చిరునవ్వు ముఖంలో నిద్రపోతున్నాడు కృష్ణమూర్తి. పసిపిల్లవాడి ముఖంలా ప్రశాంతంగా వుంది అతని ముఖం. ఆ ముఖంలో ఏ కోశానా స్వార్థంలేదు చిరాకులేదు - దగ్గిరకి వెళ్ళి అతని ఉంగరాల జుట్టులో వేళ్ళు నవరిస్తూ 'కృష్ణా' అని పిలిచింది. పిలవడమే తడువు కళ్ళు తెరిచాడు. తనే ఓడిపోయినట్లుగా చిన్నపోయింది పార్వతి. "ఉత్తరాలు పోస్టుచేస్తానని కుర్చీలో పడుకుని నిద్రపోతున్నావేం!" గోముగా అడిగింది.

"హడావిడేం లేదులే, ఎప్పుడైనా పోస్టు చెయ్యవచ్చు." పార్వతిని దగ్గరకి తీసుకొంటూ అన్నాడు కృష్ణమూర్తి.

"అప్పుడంత హడావుడి పడ్డావే!" వెక్కిరింపుగా అంది పార్వతి.

"హడావిడి పడ్డానికేముంది పార్వతీ, ఆ ఉత్తరం మా అబ్బాయికి గాని అమ్మాయికి గాని కాదుగా" చిలిపిగా పార్వతి చెవి పిండేడు కృష్ణమూర్తి.

"ఛీ పోదూ, మోటవాడివి!" అంటూ లేచింది పార్వతి. కృష్ణమూర్తి ముఖం విజయ గర్వంతో మెరిసింది. పార్వతిని ఏడిపించాలంటే—యింకోవిధం కనిపెట్టాడన్నమాట! పోస్టుకాని ఉత్తరాలసంగతి కేంకాని, యీ మాటు మళ్ళీ పోస్టుచేసే ఉత్తరం అమ్మాయికా అబ్బాయికా అంటే మటుకు పార్వతి రెండురోజులు మాట్లాడదు తనతో! నవ్వుకున్నాడు కృష్ణమూర్తి.

"ఉత్తరాలు పోస్టు చెయ్యడానికేం గాని కొంచం అన్నం పెట్టు. తిని పడుకుందాం. యిప్పుడు టైమెంతయిందో తెలుసా? రాత్రి పదవుతూంది... అయినా, ఉద్రేకువి కాకుంటే నే ఉత్తరాలు పోస్టుచేస్తానని అన్నా రాత్రివేళ పని కట్టుకువెళ్ళి ఏంలాభం అనుకున్నావు పార్వతీ" అంటూ గట్టిగా నవ్వేడు.

"నీ వేషాలకేం కాని, రా, అన్నం తిందాం!" అంటూ వంటయింటిలోకి దారితీసింది పార్వతి... భోజనం చేస్తూకూడా, పార్వతికి ఉత్తరాలసంగతి జ్ఞాపకం వస్తూనేవుంది. అందుకే, "నిజంగా ఏమైనా ఉత్తరాలు పోస్టుచెయ్యవలసినవి వున్నాయా తుండూ?" గోముగా ఎంతటి ధీరచిత్తుడినైనా నవనీతంలా కరిగించే కంఠధ్వనితో అడిగింది.

"ఔను పార్వతీ, రాధాయికి సెలవలుగా, రమ్మని రాశా. అదే రేపొద్దుట పోస్టుచెయ్యాలి." అంటూ చిలిపిగా నవ్వేడు. ఆ నవ్వుముఖమే మరుక్షణంలో గమ్మత్తుగా మారింది: దానికి కారణం పార్వతి యిట్టే కనిపెట్టేసింది: "కొంచెం వడియాలు మాడాయి అంతే" అంది తనూ నవ్వుతూ.

---

ఎడారిలో పయనిస్తూంటే ఒకనికి, ముఖం చేతుల్లో కప్పుకొని క్రిందికే చూస్తూ పోతూన్న ఒక స్త్రీ ఎదురయింది. చూడగానే "నువ్వు ఎవరు?" అని అడిగాడు. "నేను సత్యాన్ని" అని సమాధానం చెప్పింది ఆ స్త్రీ. అయితే ఊరు వదలి ఇలా ఎడారిన పడి పారిపోతున్నా వేమని అడిగాడు.

"రోజులు మారాయి యిదివరలో అబద్ధాలాడ్డం ఏకొద్దిమందికో అలవాటు. కాని యిప్పుడు ఎవరితో మాట్లాడినా అబద్ధాలే మాట్లాడుతున్నారు." అని సమాధానం చెప్పింది సత్యం.

అసత్యం సత్యంకంటే గౌరవింపబడిన చోట మానవ జీవితం అతి నికృష్టంగా వుండక తప్పదు.